క్లుప్తంగా

మున్నూరు కాపు సంఘం కార్యదర్శిగా మహేందర్



నియామకపత్రం తీసుకుంటున్న మహేందర్

తుంగతుర్తి : మండల పరిధిలోని గాజులగూడెం గ్రామానికి చెందిన గాజుల మహేందర్ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ చేతుల మీదుగా శుక్రవారం నియామకపత్రం అందుకున్నారు. వేములవాడలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయనను ఎన్నుకున్నట్లు మహేందర్ తెలిపారు. సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన కాపు నాయకులకు, సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి



అర్వపల్లిలో ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

అర్వపల్లి : ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని డీఏఓ శ్రీధర్‌రెడ్డి డీలర్లకు సూచించారు. శుక్రవారం అర్వపల్లి, జాజిరెడ్డిగూడెంలలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్లు స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. అవసరం మేరకే యూరియాను రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పెండోట గణేష్, డీలర్లు కె.నరేష్, లొడంగి నాగరాజు, రామచంద్రయ్య, వీరసోములు పాల్గొన్నారు.

ఊరూర వనమహోత్సవం నిర్వహించాలి

ఊరూర వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) శ్రీధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన రామన్నగూడెం వననర్సరీని పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా మండలంలో 30,370 మొక్కలను నాటామని, మరో 40వేల మొక్కలు ఇంటింటికి పంపిణీ చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ గోపి, ఏఓ పెండోట గణేష్, ఏఈఓ శోభారాణి, టీఏ దీపిక, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

క్షయ నిర్ధారణ శిబిరం

అర్వపల్లి : క్షయ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే తగు వైద్యం అందించి పూర్తిగా నయం చేయవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ అన్నారు. కోమటిపల్లి గ్రామంలో శుక్రవారం క్షయ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమందికి క్షయ వ్యాధి పరీక్షలు జరిపారు. 2025 వరకు దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీబీ నివారణ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వశ్రిత, హెల్త్‌అసిస్టెంట్‌లు శ్రీనివాస్, సరస్వతి, ఊర్మిళ, ఆశాకార్యకర్త శోభ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



ఎస్‌బీఐని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సైదులు

అర్వపల్లి : బ్యాంకులలో లాకర్లు సరిగా పనిచేసేలా బ్యాంకు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ ఈట సైదులు కోరారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐతోపాటు అర్వపల్లిలోని బంగారం దుకాణాలను ఆయన పరిశీలించారు. బ్యాంక్‌లలో లాకర్లకు అలారం వచ్చేలా చూడాలన్నారు. అలాగే బంగారం దుకాణాలలో చోరీలకు అవకాశం లేకుండా తగు జాగ్రత్తలు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ఆత్మకూర్(ఎస్) : గట్టికల్లు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లో రెండేళ్లుగా విద్యుత్ తీగలు ప్రమాదకంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి సమీపంలోని పల్స వెంకన్న బావి దగ్గర 6కేవీ విద్యుత్ లైన్ స్తంభాలు పక్కకు ఒరగడంతో తీగలు కిందికి వేళాడుతున్నాయి. దీంతో పొలాలు దున్నే సమయంలో రైతులు భయం దోళన పడుతున్నారు. తీగలకు కర్రలను సపోర్ట్‌గా ఉంచి పనులు చేస్తున్నారు. వర్షాల కారణంగా కర్రలకు ఎర్త్ పాస్ అవుతూ షాక్ వస్తోందని రైతులు తెలుపుతున్నారు. విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



కిందికి వేలాడిన తీగలకు ఎత్తుపెట్టిన కర్రలు

నూతన భవనం నిర్మించరూ..

అర్వపల్లి : అర్వపల్లిలోని వ్యవసాయ అధికారి కార్యాలయ భవనం పూర్తిగా శిథిలం కావడంతో కొంతకాలంగా వినియోగంలో లేకుండా పోయింది. దీంతో రామన్నగూడెం శివారులోని రైతువేదికలో ఏఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ రైతువేదిక భవనం రామన్నగూడెం- అర్వపల్లి మధ్య ఉండటంతో రైతులు అక్కడకు వెళ్లడానికి ఇబ్బందిగా మారుతోంది. బస్సులు ఆపకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం శిథిలమైన భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



అర్వపల్లిలో నిరుపయోగంగా మారిన భవనం



ఏఓ కార్యాలయం తాత్కాలికంగా కొనసాగుతున్న రామన్నగూడెంలోని రైతువేదిక

కంపచెట్ల తొలగింపు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల నుంచి కాసర్లపహాడ్‌కు వెళ్లే రోడ్డు కంపచెట్లతో నిండిపోయి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే అయితే ప్రజల ఇబ్బందులను గమనించిన జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి శుక్రవారం స్వచ్ఛందంగా కంపచెట్లను తొలగించే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కుదురుపాక ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల మోత.. ప్రజలకు వెత!



అర్వపల్లిలోని దేవాలయం ఎదుట వర్షపు నీటి మడుగులు



అర్వపల్లిలోని సంత ఆవరణలో నిలిచిన నీరు

- గతంతో ఎప్పుడూ లేని విధంగా పెరుగుతున్న దోమల ఉధృతి
- ఇళ్లలో ఉండలేక.. వీధుల్లో తిరగలేకపోతున్నామని జనాల ఆవేదన
- కొన్నేళ్లుగా నిలిచిన ఫాగింగ్

అర్వపల్లి : అర్వపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో దోమల బెడద తీవ్ర రూపం దాల్చింది. దోమల మోతతో స్థానికులతో పాటు వ్యాపారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి పన్నులు విధిగా వసూలు చేస్తున్న అధికారులు దోమల నివారణకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహించిన దోమల ఫాగింగ్ కొంతకాలంగా నిలిచిపోయింది. దీంతో దోమల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతోంది. దోమల కారణంగా గత పది రోజులుగా అనేక మంది జ్వరాల బారిన పడి ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఫాగింగ్ మిషన్లు నిరుపయోగంగా పడి ఉన్నాయని, అధికారులు వాటిని వినియోగించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రమైతే చాలు దోమల కారణంగా ఇళ్లలో ఉండలేక, బయట తిరగలేక స్థానికులు నరకం చూస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించడంతోపాటు ఇతర చర్యలు చేపట్టాలని అర్వపల్లి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇళ్లలో ఉండలేకపోతున్నాం



దోమల మోతతో సాయంత్రమైతే ఇళ్లలో ఉండలేకపోతున్నాం. దోమల మందు పిచికారీ చేయకపోవడంతో వీధులలో కూడా దోమలు విపరీతంగా ఉంటున్నాయి. దోమల కారణంగా రోగాల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫాగింగ్ చేయించాలి.

- ఈదురు వీరపాపయ్య, అర్వపల్లి

భూభారతి దరఖాస్తులను త్వరగా పరిశీలించాలి

- ఆర్డీఓ వేణుమాధవ్ రావు

ఆత్మకూర్(ఎస్) : భూభారతిలో రైతులు పెట్టుకున్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పెండింగ్ లేకుండా చూడాలని ఆర్డీఓ వేణుమాధవ్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ భూభారతి దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు పెండింగ్ లేకుండా అందరూ సమష్టిగా పనిచేయాలని, రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఆర్ఐ రామారావు, అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చివ్వెంల : భూ భారతిలో రైతులు చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి పరిశీలన చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. దరఖాస్తులకు సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలన సమయంలో తీసుకెళ్లాలని సూచించారు. వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజల కోసం అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఆర్ఐలు శ్రీనివాస్, శ్రావణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

తిరుమలగిరి : భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. శుక్రవారం నూతనకల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల ద్వారా వివిధ గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతు సమస్యను పారదర్శకంగా విచారణ పూర్తి చేసి వాస్తవాలకు అనుగుణంగా పరిష్కరించాలని సూ చించారు. విచారణ పూర్తయిన దరఖాస్తులను భూ భారతి పోర్టల్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరి : భూభారతి సదస్సులలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆర్డీఓ వేణుమాధవ్ రావు అన్నారు. శుక్రవారం మద్దిరాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అయేషా ఫర్వీన్, డీటీ కంట్లమయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమే..

- మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి



నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, సిబ్బంది

సూర్యాపేట అర్బన్ : స్వచ్ఛతలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమే అని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 45వ వార్డులో 100 రోజుల ప్రణాళికతో పాటు వనమహోత్సవంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణాలను పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో ప్రభుత్వం పటిష్ఠ నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. చెత్తను వేరు చేయడం, డ్రెయినేజీ నిర్వహణ, సౌకర్యాల మెరుగుదల వంటి విషయాలపై వివరించారు. వార్డు స్థాయిలో ఉండే సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా ఉంచడంలో అందరూ భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. అదే విధంగా పట్టణాన్ని పచ్చదనంగా ఉంచడానికి గానూ మొక్కలను నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, ఆర్ఐ గౌసుద్దీన్, మనోజ్, వార్డు అధికారి బాలగాని శ్రీనాథ్, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సయ్యద్ సమ్మి, మహిళా సంఘాల సభ్యులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



తిరుమలగిరిలో మాట్లాడుతున్న సీతారామయ్య

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఇటీవల ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుమలగిరిలోని పెన్షనర్స్ భవన్‌లో నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 1972 సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ రూల్స్ సవరణ చట్టం తేవడం పెన్షనర్లకు ఆందోళన కలిగిస్తోందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడు ఎంబీ.దేవదానం, జిల్లా కోశాధికారి హమీద్ ఖాన్, జిల్లా బాధ్యులు మండడి పద్మారెడ్డి, సారంగుల నర్సయ్య, తిరుమలగిరి మండల శాఖ అధ్యక్షులు జి.సుదర్శన్‌రావు, కార్యదర్శి బన్వరి నర్సయ్య, మండల కోశాధికారి పందిరి సత్యనారాయణ, విఠల్‌రెడ్డి, వివిధ యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి స్పాట్ అడ్మిషన్లు

సూర్యాపేట : బాలెంలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 26 నుంచి 31వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం జనరల్, ఎంపీసీ, ఎమ్మెస్ డీఎస్, ఎంజెడ్‌సీ, మిగిలిన ఎస్సీ సీట్లు భర్తీ చేయుటకు కళాశాల ప్రాంగణంలో స్పాట్ కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయి, అర్హత కలిగిన విద్యార్థినులు సంబంధిత సర్టిఫికెట్స్ తీసుకొని ఈ నెల 26 నుంచి 31వరకు కళాశాల ప్రాంగణంలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. విద్యార్థినులు దోస్త్ ఐడితో పాటు 5 పాస్‌పోర్ట్ ఫొటోలు, బోనాఫైడ్, క్యాస్ట్, ఇన్‌కమ్, ఆధార్‌కార్డ్ సర్టిఫికెట్లను తీసుకరావాలని తెలిపారు. వివరాలకు సెల్ : 79950 10681, 93983 16225 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



సూర్యాపేట : పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న భక్తులు



అర్వపల్లి : ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సూర్యాపేట : శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణ శర్మ సంతోషిమాతకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి, ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. అమ్మవారి సన్నిధిలోని శ్రీ చక్రమునకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సంతోషిమాత ఉద్యాపన వ్రతం నిర్వహించారు. అమ్మవారికి వడిబియ్యం పోశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు నూక వెంకటేశం గుప్త, ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి, ఉప కోశాధికారి కొత్త మల్లికార్జున్, అశోక్, ప్రకాశరావు, సోమ శ్రీశైలం, దేవరశెట్టి సోమయ్య, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, మహంకాళి ఉపేందర్, బజ్జూరి శ్రీనివాస్, నూక రవిశంకర్, శివప్రసాద్, నాగమణి, పద్మ, సూర్య కళ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..

అర్వపల్లి : శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీకటాక్షం కలగాలని ప్రత్యేక పూజలు జరిపినట్లు అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వాల నమోదు

చివ్వెంల : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా కార్యదర్శి చిలుక రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని దురాజ్‌పల్లి, తిమ్మాపురం, జి.తిర్మలగిరి, గుంజలూరు గ్రామాల్లో నిర్వహించిన ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమం వేతనాలు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను కొనసాగించాలని, పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేసి, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బి.దయాకర్, ఏడు కొండలు, వీరస్వామి, యాదయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురం పాఠశాలలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

వసతి గృహం, పాఠశాలల పరిశీలన



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో వంటలను పరిశీలిస్తున్న డీఈఓ అశోక్



నాగారం : జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అశోక్

నాగారం : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలను, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి చదువుపట్ల ఆసక్తి పెంచుకునే విధంగా విద్యాబోధన చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం వసతిగృహంలో, పాఠశాలల్లో రికార్డులను, ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ బేస్‌లైన్ ఫలితాలను, తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వర్, రాందాస్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీఈఓ అశోక్ అన్నారు. అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్రీడా విభాగం గదిని సందర్శించి రికార్డులు, మధ్యాహ్న భోజన వంటలు పరిశీలించారు. పదో తరగతి గదికి వెళ్లి బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటలు, విద్యాబోధన తీరు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట హెచ్‌ఎం ఎం.విజయలక్ష్మి, పీడీ, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

తెలంగాణలో బహుజన రాజ్యం సాధించాలి




తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి : తెలంగాణలో బహుజన రాజ్యం సాధించడమే సాంబశివరావు(ఉ.సా)కు ఘనమైన నివాళి అని సామాజిక తెలంగాణ మహా సభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య అన్నారు. శుక్రవారం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, సామాజిక తెలంగాణ మహాసభ ఆధ్వర్యంలో సాంబశివరావు 5వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి ప్రవీణ్, తన్నీరు రాంప్రభు, కడెం లింగయ్య, వంగరి బ్రహ్మం, ఖాసీమ్, నాగేందర్, అనిల్, భిక్షం, రాజు, మధు, రవి, బుచ్చిబాబు, రమేష్, ఈశ్వర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యమూ ముఖ్యం

పెన్‌పహాడ్ : విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యమూ ముఖ్యమే అని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంజారా భరోసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బంజారా భరోసా ఫౌండేషన్ అధ్యక్షుడు ధరావత్ గోపాల్, ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం ఫౌండేషన్ అధ్యక్షుడు గోపాల్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల ఆరోగ్యం కోసం తన కుమార్తె ప్రీతి సూచన మేరకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ప్రీతిభాయ్, లీలాబాయి, రవినాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్ అందజేస్తున్న ఎంఈఓ, బంజారా భరోసా ఫౌండేషన్ అధ్యక్షుడు

సామూహిక సీమంతం

తిరుమలగిరి : నూతనకల్ మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ అనుమతి లేదు

సూర్యాపేటటౌన్: చివ్వెంల మండలం బీబీగూడెం పరిధిలో ఉన్న శ్రీచైతన్య ప్రైవేట్ పాఠశాలకు సీబీఎస్ఈ తరగతులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు లేవని జిల్లా విద్యా శాఖ అధికారి కె.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలకు కేవలం రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నాగారం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కుంభం కర్ణాకర్ అన్నారు. శుక్రవారం నాగారంబంగ్లా గ్రామంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బీజేపీని బలోపేతం చేస్తేనే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి పార్టీని, పార్టీ విధానాలను బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిస్తోందని, ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశంలో కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. అనంతరం ఈటూరుకు చెందిన నంగనూరి యాదగిరి బీజేపీలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు మేడబోయిన యాదగిరి, సత్యనారాయణ, నాయకులు కన్నెబోయిన రాములు, అంబటి సత్యనారాయణ, సాయిలు, బొల్లెద్దు సురేష్, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

ఆత్మకూర్(ఎస్) : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎన్‌ఎం సల్వాది నిర్మల అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నసీంపేట గ్రామంలో సీజనల్ వ్యాధులపై డోర్ టు డోర్ సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇళ్లలోని పాత కుండలు, పాత టైర్లు, పాత వస్తువులలో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త మణెమ్మ, గ్రామస్తులు దంతూరి సోమన్న, మూల ఎల్లయ్య, కాంపాటి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి బి. నగేష్ కోరారు. కలుషిత ఆహారం, కలుషిత నీళ్ల ద్వారా వచ్చే వ్యాధులపై శుక్రవారం కొమ్మాల జెడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలం సీజన్‌లో దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేడి నీటిని తాగాలని, బయటి ఆహార పదార్థాలు తినకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ బిచ్చునాయక్, హెచ్‌ఎం శేఖర్, డాక్టర్ మధుప్రియ, ఎంఎల్‌హెచ్‌పీ వశ్రిత, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, సరస్వతి, ఊర్మిళ, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



అర్వపల్లి : అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ



ఆత్మకూర్(ఎస్) : అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

తిరుమలగిరి : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య అన్నారు. సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సైబర్ మోసాలు విపరీతంగా పెరిగాయని, వాటి నివారణ కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అపరిచిత వ్యక్తుల ఫోన్‌లు ఎత్తరాదని, వ్యక్తిగత సమాచారం ఎవరికి ఇవ్వవద్దని సూచించారు.



నూతనకల్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు